సాక్షి నిర్మల్

ఆదివారం । 28 । జూలై । 2024



గడ్డిమందుకు అడ్డేది?

10లో ▸

అక్రమార్కులు నిషేధిత గ్లైఫోసెట్‌ను మహారాష్ట్ర నుంచి తెచ్చి రైతులకు విక్రయిస్తున్నారు. ఈ గడ్డిమందుతో రైతులు ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు.

ఆర్డీవో ఆఫీస్‌లో బదిలీలు

భైంసాటౌన్: భైంసా ఆర్డీవో కార్యాలయంలో పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. నాయబ్ తహసీల్దార్ శంకర్ నిర్మల్ ఎస్‌డీసీకి, సీనియర్ అసిస్టెంట్ నాగనాథ్ బాసరకు, జూనియర్ అసిస్టెంట్ సబా తబస్సుమ్ కుంటాలకు బదిలీ కాగా, వారి స్థానంలో కలెక్టరేట్ నుంచి సీనియర్ అసిస్టెంట్లు నాగజ్యోతి, ప్రవల్లిక, నిర్మల్ ఆర్డీవో కార్యాలయం నుంచి శ్రీదేవి బదిలీపై వచ్చారు.

గరిష్టం/కనిష్టం
27.0 /24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో పలు చోట్ల ఉదయం భారీ, సాయంత్రం మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మూతపడిన కుభీర్ రెండో అంగన్‌వాడీ కేంద్రం



మూసి ఉన్న రెండో అంగన్‌వాడీ కేంద్రం

కుభీర్: మండల కేంద్రంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐదురోజులుగా తెరవడంలేదు. అంగన్‌వాడీ కార్యకర్త సంతోషి గతేడాది అనారోగ్యంతో మృతి చెందింది. 12మంది చిన్నారులతో కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఆయాను వయోభారం కారణంగా ఇటీవల తొలగించారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం మూతబడింది. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితను ప్రశ్నించగా.. కార్యకర్త, ఆయా లేకనే కేంద్రం మూతపడిందని తెలిపారు. ప్రతీ సోమవారం గాయత్రి అనే అంగన్‌వాడీ కార్యకర్తను కేంద్రానికి పంపిస్తామని చెప్పారు.

సెలవు మంజూరు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: సమస్యల పరిష్కారానికి ఈ నెల 31వ తేదీన 'చలో హైదరాబాద్' కార్యక్రమం తలపెట్టినందున ఆరోజు సెలవు మంజూరు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భుక్య రమేశ్ మాట్లాడారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం రూ.10వేలు చెల్లించడంలేదని తెలిపారు. రాగిజావ, అల్పాహారం పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో చిట్యాల లక్ష్మి, ఇనుగందుల లక్ష్మి, సారంగాపూర్ సాయవ్వ, గంగవ్వ, పోశన్న పాల్గొన్నారు.

అరగంట ముందే ఓపీ బంద్



తాళం వేసి ఉన్న ఓపీ గది

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో శనివారం ఓపీ అరగంట ముందే నిలిపేశారు. రెండు ఓపీ గదులకు మధ్యాహ్నం 12.30 గంటలకే తాళం పడింది. దీంతో రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఇటీవల ఆస్పత్రి నుంచి ముగ్గురు వైద్యులు బదిలీ కాగా, నలుగురికి ఇంకా ఆర్డర్ రాలేదు. బోధన్ నుంచి ఇద్దరు డిప్యూటీ సివిల్ సర్జన్లు బదిలీపై భైంసాకు రాగా, వీరిలో ఒకరు సెలవులో ఉన్నారు. నిర్మల్ నుంచి ముగ్గురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు బదిలీపై రాగా, ఇద్దరు సెలవులో ఉన్నట్లు తెలిసింది. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని పలువురు కోరుతున్నారు.

హోటళ్లు, కిరాణా షాపుల్లో తనిఖీలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న వాసురాం

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, కిరాణా దుకాణాల్లో శనివారం జిల్లా ఆహార భద్రత అధికారి వాసురాం తనిఖీలు నిర్వహించారు. వస్తువుల నాణ్యత లోపం కారణంగా పలు దుకాణాలపై కేసులు నమోదు చేసి రూ.85వేల జరిమానా విధించారు. కల్తీ లేని ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించాలని సూచించారు. లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాస్తాపూర్ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

చూసొద్దాం రండి..!

- జల్లులతో విచ్చుకున్న ప్రకృతి
- చిందులేస్తున్న జలపాతాలు
- ఆహ్వానం పలుకుతున్న ఆహ్లాదం
- ఎటు చూసినా పచ్చదనమే..
- జాగ్రత్తగా వెళ్లొస్తే ఆనందమే..

నిర్మల్: ఆకాశానికి జల్లెడ పట్టినట్లు జల్లులుగా కురుస్తున్న వానచినుకులతో ప్రకృతి విచ్చుకుంది. ఎటు చూసినా జిల్లా పచ్చని అందాలతో కళ్లకు హాయినిస్తూ.. మనస్సును ఆహ్లాద పరుస్తోంది. మనదగ్గరే సహజసిద్ధమైన జలపాతాలు, సహ్యాద్రి ఒంపుసొంపుల ఘాట్‌రోడ్లు, అలా.. ఘాట్ల పైనుంచి జాలువారే సెలయేళ్లు, కడెం ప్రాజెక్టులో బోటు షికార్లు, గోదారి అలల అందాలు, బ్యాక్‌వాటర్‌లో సందడి చేసే జింకలు.. ఇలా ఎన్నో వానాకాలపు ప్రకృతి అందాలు ఆహ్వానం పలుకుతున్నాయి. ఈ సీజన్‌ను ఆసాంతం ఆస్వాదించాలంటే జాగ్రత్త కూడా అవసరం. అడుగులో అడుగేసుకుంటూ ఓపికతో వెళ్తే.. తనలోని అందాలతో ప్రకృతి మైమరిపిస్తుంది. ఆది, సోమవారాలు వరుస సెలవులు రాగా జిల్లావాసులు ఇప్పటికే ఈ దిశగా ప్లాన్ చేసుకుంటున్నారు.

ప్రకృతి'మార్గం'లో..

చూడాలన్న ఓపిక ఉండాలే గాని ప్రకృతి ఎన్నయినా చూపిస్తుంది. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ వెళ్లే ఘాట్‌రోడ్డు మార్గమైనా, బైపాస్ రోడ్డులోనైనా.. అలా వెళ్తుంటే గమ్మత్తుగా ఉంటుంది. మధ్యలో నల్లని రోడ్డు.. ఇరువైపులా పచ్చని అడవి.. మొత్తం దారిపొడవునా అడవి అందాలు మనస్సును కట్టిపడేస్తాయి. నిర్మల్ నుంచి ఎన్‌హెచ్–44 బైపాస్ గుండా వెళ్తే జిల్లా సరిహద్దులో ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కొరిటికల్ జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

ఈ సీజన్‌ను ఆస్వాదించాలంటే ఓపికతో పాటు చాలా జాగ్రత్తలూ అవసరం. ఏమాత్రం ఏమరుపాటు లేకుండా పక్కాగా ఉంటేనే ప్రకృతిలో ఆనందంగా గడపవచ్చు. ప్రధానంగా జలపాతాల వద్ద నీళ్లలోకి వెళ్లి.. కుటుంబాలకు కుటుంబాలే కొట్టుకుపోయిన ఘటనలు ఎన్నో చూస్తున్నాం. జలపాతాల దగ్గర నీళ్లు పడే దిగువ ప్రాంతంలో అస్సలు ఉండొద్దు. స్థానికంగా వర్షం లేకున్నా.. పైనుంచి ఎప్పుడైనా వరద రావచ్చు. అటవీ ప్రాంతాల్లో ఆచితూచి అడుగు వేయాలి. మనం వెళ్లే ప్రాంతం గురించి ముందే కొంత తెలుసుకుని వెళ్తే.. మన ప్రకృతి ప్రయాణం మరింత ఆనందంగా సాగుతుంది.

ప్రకృతి అందాల సహ్యాద్రి



పచ్చని చెట్లు, దట్టమైన అడవులు, ఎత్తయిన జలపాతాలు, నల్లని రాళ్ల పైనుంచి పారే సెలయేళ్లతో.. ఒంపుసొంపులు తిరిగే ఘాట్‌రోడ్లతో.. ఎంతో ఆకట్టుకుంటాయి సహ్యాద్రి సానువులు. సన్నని వాన కురుస్తున్న వేళ.. పొగమంచు కమ్ముకుంటూ వస్తుంటే.. సహ్యాద్రి అందం మరింత విచ్చుకుంటుంది. దక్షిణ కశ్మీరాన్ని తలపిస్తుంది. నిర్మల్ నుంచి వెళ్లేటప్పుడు ఘాట్‌రోడ్డు ప్రారంభంలో కొంతదూరంలోనే ఓ పొడవాటి జలపాతం ఆకట్టుకుంటోంది. రెండేళ్లక్రితమే దీన్ని ప్రకృతిప్రేమికులు గుర్తించారు. కానీ.. ఇది వర్షం ఎక్కువగా కురిసినప్పుడే పారుతుంది. ఘాట్‌రోడ్డు మధ్యలో ఉన్న వాచ్‌టవర్ నుంచి కిందికి వీక్షిస్తే.. పచ్చని అటవీ అందాలు మనస్సుకు ఎంతో హాయినిస్తాయి.

- హైదరాబాద్–నాగపూర్ దారిలో ఎన్‌హెచ్–44పై వెళ్తుంటే.. జిల్లాకేంద్రానికి 10–12కిలో మీటర్ల దూరంలో సహ్యాద్రి శ్రేణులు పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి.


జలపాతం పిలుస్తోంది..



జిల్లాకు ఉత్తరాన గల సహ్యాద్రి శ్రేణులు ఎన్నో అందాలను మూటగట్టుకున్నాయి. ఇందులో ఎగిసిపడే ప్రకృతి అందమే వాస్తాపూర్ జలపాతం. కళ్ల నిండుగా కనిపించే పాలనురగల్లాంటి నీటిజల్లులు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఇక్కడ నీటి ప్రవాహమూ తక్కువలోతు ఉండటంతో చిన్నారులతో సహా ఇంటిల్లిపాది వచ్చి వీక్షిస్తుంటారు.

- నిర్మల్ నుంచి మామడ మండలంలోని తాండ్ర గ్రామం మీదుగా వాస్తాపూర్ వెళ్లాలి. ఎన్‌హెచ్–44 బైపాస్ నుంచి ఐదు కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. నిర్మల్ నుంచి 20 కిలో మీటర్ల వరకు వస్తుంది. ఇక్కడ ఎలాంటి వసతులు లేవు. ఇంట్లోనే కావాల్సినవి వండుకుని పొద్దున్నే వెళ్తే.. సాయంత్రం వరకూ వాస్తాపూర్ అందాలను ఆస్వాదించవచ్చు.

వన్యప్రాణుల సందడి



జిల్లాకు ప్రాణదాయినిలా సాగుతున్న గోదావరి వెంట ఎన్నో ప్రకృతి అందాలూ ఉన్నాయి. ప్రధానంగా ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో గోదావరి ఒడ్డున పచ్చని గడ్డిభూములు ఆకట్టుకుంటాయి. వీటిలో జింకలు, నెమళ్లు చేసే సందడిని చూసేందుకు ప్రకృతి ప్రేమికులు అధికసంఖ్యలో వస్తుంటారు.

- నిర్మల్ జిల్లాలో బాసర, ఓణి నుంచి లోకేశ్వరం మండలం బ్రహ్మేశ్వరం, పంచగుడి వరకు, అలాగే గోదావరికి అటువైపున్న నిజామాబాద్ జిల్లాలోని సీహెచ్ కొండూర్, జీజీ నడ్కుడ, బాద్గుణ, ఉమ్మెడ తదితర గ్రామాల నుంచి వెళ్లి.. బ్యాక్‌వాటర్ అందాలు ఆస్వాదించవచ్చు.

పాపికొండల్లా 'కడెం'..!

ఓ దిక్కు ఎత్తయిన కొండలు.. వాటిపై దట్టమైన అడవులు.. వాటిని ఆనుకునే నిండుకుండలా ఉంటుంది కడెం ప్రాజెక్ట్. ప్రాజెక్ట్‌లోని బ్యాక్‌వాటర్‌లో బోటు షికారు చేస్తే పాపికొండల్లో గోదారిపై పయనించిన ఫీలింగ్ వస్తుంది. ప్రాజెక్ట్‌తో పాటు ఇక్కడ పచ్చదనాన్ని ఆస్వాదించే అవకాశం ఉంటుంది. ప్రాజెక్ట్ గేట్లు ఎత్తినప్పుడు మాత్రం బోటుషికారును నిలిపివేస్తుంటారు.



'కడెం'లో బోటు షికారు చేస్తున్న సందర్శకులు

- కడెం ప్రాజెక్ట్ నిర్మల్ నుంచి మంచిర్యాలకు వెళ్లే మార్గంలో జిల్లాకేంద్రం నుంచి 50కిలో మీటర్ల దూరంలో ఉంటుంది.

మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన జేఏసీ నిరసన



ఢిల్లీలో నిరసన తెలుపుతున్న నాయకులు

కడెం: లంబాడా సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం గిరిజన జేఏసీ నాయకులు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ విషయంపై రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ స్పందించేదాకా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. గిరిజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ రాథోడ్, ఉపాధ్యక్షుడు బాణావత్ సిద్ధార్థ నాయక్, మహేందర్, శివ తదితరులున్నారు.

స్వర్ణ ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత

సారంగాపూర్: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 1,183 అడుగులు (1.484 టీఎంసీ) కాగా, 1180.2 అడుగుల (1.192 టీఎంసీ)కు చేరింది. ప్రాజెక్ట్ జేఈ మధుపాల్, దేవేందర్ అప్రమత్తమై శనివారం తెల్ల వారుజామున మూడోగేటు ఎత్తి 1,830 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నీటిపారుదల శాఖ డీఈఈ శ్రీనివాస్ ప్రాజెక్ట్ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు.

వారంరోజులుగా వాగులో నుంచే రాకపోకలు



రెంకొని వాగులోంచి వెళ్తున్న ద్విచక్రవాహనదారులు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ టూ ఖానాపూర్‌తోపాటు దిలావార్‌పూర్ టూ ఖానాపూర్ మార్గంలోని రెంకొనివాగుపై వేసిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోగా అధికారులు వారం క్రితం రాకపోకలు నిలిపివేశారు. ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేవారికి సుమారు ఎనిమిది కిలోమీటర్లకుపైగా దూరభారం పెరిగింది. అత్యవసరం ఉన్న వారు వాగులోంచి అతికష్టంగా దాటుతున్నారు. సుమారు 20కిపైగా గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

ముగిసిన జాతీయ సాధన సర్వే శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న శిక్షకులు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయులకు రెండురోజులుగా ఇస్తున్న జిల్లాస్థాయి జాతీయ సాధన సర్వే శిక్షణ శనివారం ముగిసింది. జిల్లా కేంద్రంలోని కస్బా ఉన్నత పాఠశాలలో ప్రాథమికస్థాయి గణితం, పరిసరాల విజ్ఞానం, సోఫీనగర్‌లోని కేజీబీవీలో ఉన్నత పాఠశాల స్థాయి ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, సోషల్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. నవంబర్‌లో నిర్వహించే నాస్ పరీక్షలో ఉత్తమ ఫలితాల సాధనకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన జిల్లా రిసోర్స్ పర్సన్లతో మండల రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులకు అభ్యసన ఫలితాలు, బోధన అభ్యసన ప్రక్రియ, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కోర్సు ఇన్‌చార్జీలు పరమేశ్వర్, విజయ్‌కుమార్, ఏఎంవో నర్సయ్య, డీఆర్పీఎస్ శంకర్, చిన్నయ్య, గోవర్ధన్, వెంకటరాజం, వందన, దేవేందర్, సుదర్శన్, గంగాసురేశ్, భూషణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులోనే సురక్షిత ప్రయాణం

నిర్మల్ టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి పేర్కొన్నారు. ప్రమాద రహిత వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు 'లక్ష్మే లక్ష్యం'లో సంస్థకు అత్యధిక ఆదాయం సమకూర్చిన కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బందికి ఉత్తమ ఉద్యోగ ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో ప్రతీ ఉద్యోగి సంస్థ అభివృద్ధికి పాటుపడాలని, నిర్మల్ డిపోను రాష్ట్రంలోనే నంబర్ వన్ డిపోగా ఉంచాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మల్ టౌన్: ఉత్తమ ఉద్యోగులతో ప్రతిమారెడ్డి

సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

భైంసాటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని డీఎం హరిప్రసాద్ డ్రైవర్లకు సూచించారు. ప్రమాద రహిత వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం డిపోలో అద్దె బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మత్తు పానీయాలు సేవించి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, సిబ్బంది చందు ఉన్నారు.

గడ్డెన్నవాగుకు చేరని నీరు

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో వరద నీరు చేరడం లేదు. ఎగువన సరైన వర్షాలు లేక ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో రాలేదు. ఈ సీజన్‌లో దాదాపు వెయ్యి క్యూసెక్కులు మాత్రమే నీరు చేరింది. గతేడాది ఈపాటికే ప్రాజెక్ట్‌లోకి పూర్తిస్థాయిలో వరదనీరు చేరగా, గేట్లు ఎత్తి దిగువకు వదిలారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, శనివారం 335 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 356.20 మీటర్ల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం ఐదారు రోజులుగా వర్షం కురుస్తున్నా ప్రాజెక్ట్ నిండడం లేదు. స్వల్ప ఇన్‌ఫ్లో వస్తుండగా 0.820 టీఎంల నీరు నిల్వ ఉంది. ఆయకట్టు కింది భైంసా, లోకేశ్వరం మండలాల్లో 14వేల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉంది. ఆగస్టులో భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండుతుందని అధికారులు భావిస్తున్నారు.

నెత్తు'రోడ్డు'తోంది..!

- పలుచోట్ల ఇరుకు కల్వర్టులు, బ్రిడ్జిలు
- రోడ్డు పక్కనే వాహనాల పార్కింగ్
- అస్తవ్యస్త నిర్వహణతో ఇబ్బందులు
- నేషనల్ హైవేపై తరచూ ప్రమాదాలు

భైంసాటౌన్: 61వ నంబర్ జాతీయ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు తీవ్రగాయాలపాలై ఆస్పత్రుల పాలవుతుండగా, కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. రహదారి పొడవునా పలుచోట్ల ఇరుకైన కల్వర్టులు, అవసరమైన చోట వంతెనలు నిర్మించకపోవడంతో పలు సందర్భాల్లో భారీ వాహనాలు అదుపు తప్పి వంతెనల పైనుంచి కిందపడుతున్నాయి. కొన్ని ఘటనల్లో ప్రాణనష్టం తప్పుతున్నా, ఆస్తి నష్టం భారీగా జరుగుతోంది. ఇక రహదారి పక్కన భారీ వాహనాలు నిలిపి ఉంచుతుండటంతో ద్విచక్ర వాహనదారులు గమనించక వెనుకనుంచి ఢీకొని ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. దీనికితోడు జాతీయ రహదారి నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో పలుచోట్ల మట్టి, పిచ్చిమొక్కలతో పేరుకుపోతోంది. టోల్‌చార్జీలు వసూలు చేయడంపై ఉన్న దృష్టి రహదారి నిర్వహణపై కూడా ఉండాలని పలువురు వాహనదారులు మండిపడుతున్నారు.

రోడ్డెక్కితే భయమే..!

భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. రహదారి నిర్వహణ సక్రమంగా లేక, పలు చోట్ల ప్రమాద హెచ్చరిక, సూచిక బోర్డులు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో బెల్తరోడ నుంచి నిర్మల్‌లోని మంచిర్యాల చౌరస్తా వరకు 53కిలో మీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. అలాగే, ఖానాపూర్ వరకు మరో 39 కిలో మీటర్ల దూరం ఉంది. కాగా, ప్రస్తుతం రెండులేన్ల రహదారి ఉండగా, అవసరమైన చోట వంతెనలు నిర్మించలేదు. భైంసా మండలంలోని మాటేగాం, కుంటాల మండలం కల్లూరు, నర్సాపూర్(జీ) మండలంలోని గుండంపల్లి క్రాస్‌రోడ్, నిర్మల్ వద్ద చిట్యాల బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తల్వేద ఎక్స్‌రోడ్, దిలావర్‌పూర్ బస్టాండ్, చర్లపల్లి ఎక్స్‌రోడ్ ప్రమాదాలకు నిలయంగా మారాయి. న్యూలోలం, సిర్గాపూర్ బస్టాండ్ వద్ద డివైడర్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.



చిట్యాల వద్ద ఇరుకు బ్రిడ్జిని ఢీకొన్న లారీ (ఫైల్)

ఇటీవలి కొన్ని ఘటనలు

- ఈనెల 16న అతివేగంగా వచ్చిన లోడ్ లారీ చిట్యాల వద్ద బ్రిడ్జిని ఢీకొని ఆగిపోయింది. అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది.
- జూన్ 19న నర్సాపూర్ (జీ) మండలంలోని రాంపూర్ వద్ద జాతీయ రహదారిపై నిర్మల్ పట్టణానికి చెందిన అద్దెకార్ క్రాంతికుమార్ (30) ద్విచక్రవాహనంపై లోకేశ్వరం వైపు వస్తుండగా నిర్మల్ వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో క్రాంతికుమార్ దుర్మరణం చెందాడు.
- మార్చి 29న నర్సాపూర్ (జీ) మండలం అర్లి(కే) ఎక్స్‌రోడ్ వద్ద లోకేశ్వరం మండలం బాగాపూర్‌కు చెందిన మాదరి భోజన్న (50) రాంపూర్ నుంచి బాగాపూర్ వెళ్తుండగా ఎదురుగా ట్రాక్టర్‌ను ఢీకొని తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఫిబ్రవరి 27న అర్లి(కే) గ్రామానికి చెందిన మగ్గిడి సుధాకర్ (43) ద్విచక్ర వాహనంపై ఎక్స్‌రోడ్ దాటుతుండగా భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

భైంసాలో లెక్కకు మించి..

భైంసా పట్టణంలో జాతీయ రహదారిపై ప్రమాదాలకు లెక్కే లేదు. ముఖ్యంగా నిర్మల్ చౌరస్తా వద్ద ఎలాంటి సిగ్నల్స్ లేకపోవడంతో హైవేపై అధిక వేగంతో వచ్చే వాహనాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టణంలోకి వెళ్లే రోడ్డుతోపాటు రాహుల్‌నగర్‌కు వెళ్లే కూడలి కావడంతో రోడ్డు దాటే క్రమంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కూడలి వద్ద సరైన ఏర్పాట్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి మార్గంలోని స్థానిక ఫైర్‌స్టేషన్ కూడలి వద్ద, ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే కూడలి వద్ద కూడా ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. కాలనీల్లోంచి రోడ్డుపై వచ్చే క్రమంలో జాతీయ రహదారిపై వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

నాలుగు వరుసలుగా చేస్తేనే..

జిల్లాకు సరిహద్దునున్న మహారాష్ట్ర నుంచి జిల్లాకు వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. తానూరు మండలం బెల్తరోడ నుంచి భైంసా మీదుగా నిర్మల్ వరకు 61వ జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ మార్గం మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ప్రస్తుతం రెండు వరుసల రోడ్డు మాత్రమే ఉండడంతోపాటు పలుచోట్ల ఇరుకు వంతెనల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారి మార్గంలో ఆయా గ్రామాల వద్ద బస్టాప్‌లు నిర్మించినా, వాటిని వినియోగించడం లేదు. దీంతో రోడ్డు పక్కనే బస్సులు, ప్రైవేట్ వాహనాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రయాణికులను ఎక్కించుకునే క్రమంలో బస్సులూ రహదారిపైనే నిలుపుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారిపై భారీ వాహనాలకు పార్కింగ్ స్థలాలు లేక పలుచోట్ల లారీలు రహదారి పక్కనే నిలిపి ఉంచుతున్నారు. రాత్రి వేళ గమనించని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నాలుగు వరుసలతో రహదారిని అభివృద్ధి చేసి ఇరుకు వంతెనలను విస్తరిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లాలో 61వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. లారీలను రహదారి పక్కన నిలుపకుండా చూస్తాం. ప్రమాదాలు జరగకుండా పెట్రోలింగ్ టీంలతో పర్యవేక్షిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పీడీ, ఎన్‌హెచ్ఏఐ

క్లుప్తంగా

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు శనివారం 5,806 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో, ప్రాజెక్ట్ అధికారులు ఒక గేటు ఎత్తి 7,120 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 (7.603 టీఎంసీ) అడుగులు కాగా ప్రస్తుతం 694 (6.136టీఎంసీ) అడుగులు ఉంది.

బాసరలో ఏపీ అడిషనల్ డీజీ పూజలు



ఆర్కే.మీనాను ఆశీర్వదిస్తున్న అర్చకులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని ఏపీ అడిషనల్ డీజీ ఆర్కే.మీనా శనివారం దర్శించుకున్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో పనిచేసిన ఆయన రాష్ట్ర విభజనతో ఏపీ కేడార్‌కు కేటాయించారు. శనివారం ఆలయానికి వచ్చిన మీనాకు అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ మీనా కుటుంబ సభ్యుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి హారతి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. మీనా వెంట నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్, బాసర ఎస్సై గణేశ్ తదితరులు ఉన్నారు.

'సకురా సైన్స్'కు ఎంపిక పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిర్మల్ రూరల్: జపాన్‌లో నవంబర్ 10నుంచి 16వరకు నిర్వహించనున్న సకురా సైన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం జిల్లా కేంద్రంలోని అర్బన్ కేజీబీవీలో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. అర్హత కలిగిన 22మంది జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న, 10వ తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో జిల్లా కేంద్రంలోని టీఎస్ఆర్‌జేసీ విద్యార్థిని జీ తనుశ్రీ ప్రతిభ చాటి ఎంపికైనట్లు డీఈవో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 33 మంది విద్యార్థులను ఎంపిక చేసి, రాష్ట్రస్థాయిలో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురిని నవంబర్‌లో ప్రభుత్వం జపాన్‌కు పంపించనుందని పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, అబ్జర్వర్ విజయ్‌కుమార్, నారాయణవర్మ, మనోహర్‌రెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని కుమ్మరికుంట మినీ ట్యాంక్‌బండ్‌పై అమర్చిన విద్యుత్ స్తంభానికి తగిలి రెండు గొర్రెలు మృతి చెందినట్లు గొర్ల కాపరి మధు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ట్యాంక్‌బండ్‌పై రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వేసేందుకు స్తంభం కింది భాగంలో ఏబీ స్విచ్‌లు అమర్చారన్నారు. స్విచ్‌లు కిందకు వేలాడుతుండడంతో విద్యుత్‌షాక్ తగిలి గొర్రెలు మృతి చెందాయని వాపోయారు. రెండు గొర్రెలు మృతి చెందడంతో రూ. 20 వేలు నష్టం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గొర్రెలు మృతి చెందాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

వాగు దాటితేనే వైద్యం



వాగు దాటి గోపాల్‌పూర్ గ్రామానికి వెళ్తున్న వైద్యాధికారులు



అడవిలో కాలినడకన జెండాగూడకు వెళ్తున్న వైద్య సిబ్బంది



తిప్ప వాగు దాటుతున్న వైద్య సిబ్బంది

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. అనేక గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వాగులు ఉండడంతో రాకపోకలు సాగించే వారు ప్రమాదకరంగా వాగులు దాటుతున్నారు. ఆయా గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించగా వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది వాగులు దాటారు. కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాలినడకన వెళ్లి వైద్య సేవలు అందించారు. ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగరం పీహెచ్‌సీ పరిధి హీరాపూర్ గ్రామపంచాయతీలోని గోపాల్‌పూర్ గ్రామానికి వైద్యులు ప్రతాప్‌నాయక్, పూజిత, సిబ్బంది శనివారం వాగులు, వంకలు దాటి ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్యసేవలు అందించారు. ఇచ్చోడ మండలం నర్సాపూర్ పీహెచ్‌సీ సిబ్బంది అడవిబాటలో కాలినడకన నాలుగు కిలోమీటర్లు వెళ్లి వైద్య సేవలు అందించారు. జెండాగూడ, ధర్మాజిపేట్, కొలంగూడ, బుర్సిగుట్ట గ్రామాలకు హెల్త్‌అసిస్టెంట్ రాథోడ్ కృష్ణ, ఏఎన్ఎం రేణుక, ఆశ కార్యకర్త సరోజలు నడుచుకుంటూ వెళ్లి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని తిప్ప, అడ్డగుట్ట, అసోదా బొప్పపూర్ మారుమూల గిరిజన గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో వాగులు పొంగుతుండడంతో వైద్య సిబ్బంది వాటిని దాటుతూ వెళ్లి శిబిరాలు నిర్వహించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాల్లో రోడ్డు సౌకర్యంతో పాటు వాగులపై వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- ఇంద్రవెల్లి/ఇచ్చోడ/ఆదిలాబాద్‌రూరల్

గడ్డి మందుకు అడ్డేది?

- గ్లైసిల్ విత్తనం మాదిరే.. గ్లైఫోసెట్ సరఫరా
- దెబ్బతింటున్న భూసారం
- ప్రభుత్వ నిషేధం ఉన్నా పట్టింపేది?

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిషేధిత, గుర్తింపు లేని విత్తనాలను అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. నిషేధిత విత్తన సరఫరాని పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయలేకపోయారు. ఇప్పుడు కలుపుమందు సరఫరా నియంత్రించకపోవడంతో జిల్లాలో అక్రమవ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో పత్తి సాగు ఎక్కువగా ఉంది. విత్తనాలు, కలుపు నివారణ గడ్డి మందు దందా యథేచ్ఛగా సాగుతోంది. ఓ వైపు వర్షాలు కురుస్తుండడం, మరో వైపు చేలలో కలుపు మొక్కలు పెరిగిపోతున్నాయి. దీని నివారణకు రైతులు నిషేధిత గ్లైఫోసెట్‌ను వాడుతున్నారు. వ్యాపారులు గుర్తింపు లేని పత్తి విత్తనాలు చేరవేసిన మాదిరిగా గ్లైఫోసెట్‌ను అందజేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి జిల్లాకు చేరవేస్తున్నారు. అటవీప్రాంతం, చేల వద్ద భూమిలో పాతి పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, తాండూర్, భీమిని, మహారాష్ట్ర సిరొంచ మీదుగా అర్జునగుట్ట, కోటపల్లి, చెన్నూర్ సరిహద్దు నుంచి వేలాది లీటర్లు తరలిస్తున్నారు. చోటమోట నాయకుల హస్తంతోనే పెద్ద మొత్తంలో సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాత్రికి రాత్రే ప్రైవేటు వాహనాల ద్వారా జిల్లాకు చేరుకుంటున్నాయి. గ్లైఫోసేట్‌తో భూసారం కోల్పోవడం, పర్యావరణానికి ముప్పు ఉంది. రైతులు క్యాన్సర్, తదితర ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

గుట్టుచప్పుడు కాకుండా..

ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం 1.60 లక్షల ఎకరాల్లో ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 1.48 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఇందులో 30 శాతం వరకు నిషేధిత గ్లైసిల్ విత్తనాలే ఉన్నట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా నిషేధిత గ్లైఫోసెట్ మందును రైతులకు అందిస్తున్నారు. లీటర్‌కు రూ.700 నుంచి 900 చొప్పున, 5 లీటర్లు, 10 లీటర్లు, 20 లీటర్ల క్యాన్ల విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. లిక్విడ్ కాకుండా పౌడర్ రూపంగా తీసుకువస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న గ్లైఫోసెట్ గడ్డిమందు (ఫైల్)

దెబ్బతింటున్న భూసారం

పత్తి చేనులో కలుపు తీతకు రైతులు గ్లైఫోసెట్‌ను వాడుతున్నారు. దీంతో పర్యావరణానికి హానితోపాటు భూసారం దెబ్బతింటుంది. జిల్లాలో సాగయ్యే పత్తి పంట కలుపు నివారణ, కూలీల కొరతను అధిగమించడానికి గ్లైఫోసెట్ మందును పిచికారికి ఆసక్తి కనబరుస్తున్నారు. నిషేధిత గ్లైఫోసెట్ కొనుగోలుకు వేలకు వేలు ఖర్చుచేస్తున్నారు. అధికారులు దాడులు చేసి వందల క్వింటాళ్ల గ్లైసిల్ లూజు క్వింటాళ్ల కొద్దీ విత్తనాలు, ప్యాకెట్లను పట్టుకున్నారు. అప్పటికే చాలామటుకు విత్తనాలు రైతులకు చెంతకు చేరాయి.

ప్రాణానికి ముప్పు

నాలుగైదు ఏళ్ల నుంచి ఉమ్మడి జిల్లాలో రైతులు నిషేధిత (బీజీ–3) పత్తి విత్తనాలు సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలు అమెరికాకు మోన్‌శాంటో అనే కంపెనీ విడుదల చేసింది. విత్తనంతోపాటు అదే కంపెనీ గ్లైఫోసెట్ పేరుతో గడ్డి మందును తయారు చేసింది. బీజీ–3 పత్తి విత్తనం సాగు చేసిన పంటలో ఈ మందు పిచికారి చేస్తే గడ్డి మాత్రమే చనిపోతుంది తప్పా పత్తి మొక్కలకు ఏమి కాదు. కాని ఈ గ్లైఫోసెట్ వినియోగించడం వల్ల భూసారం కోల్పోవడం, పర్యావరణానికి హాని, రైతులకు ప్రాణానికి ముప్పు కలుగుతుంది. ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి పెద్దమొత్తంలో వీటి అమ్మకాలు నిషేధించింది.

'గాయత్రి' పరవళ్లు



ఇచ్చోడ మండలం గుండివాగు అటవీ ప్రాంతంలో సహజసిద్ధంగా ఏర్పడ్డ గాయత్రి జలపాతం నీటితో పరవళ్లు తొక్కుతోంది. 350 అడుగుల ఎత్తులోని రెండు భారీ కొండల మధ్య నుంచి పారుతున్న జలపాతం చూపరులకు కనులవిందు చేస్తోంది. ఇచ్చోడ నుంచి 13 కిలోమీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. - ఇచ్చోడ

పశువులు తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

నేరడిగొండ: పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ లారీని పట్టుకున్నట్లు ఏఎస్సై రాథోడ్ మారుతి తెలిపారు. మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద శనివారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా 54 పశువులను యూపీ నుంచి కేరళకు కంటైనర్‌లో తరలిస్తుండగా పట్టుకొని కంటైనర్ సీజ్ చేయడంతో పాటు పశువులను ఇచ్చోడలోని గోశాలకు తరలించారు. కాగా అక్రమంగా పశువులను తరలిస్తున్న దానిష్, అజీమ్, షాహిద్, ఆసిఫ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ నాందేవ్, కానిస్టేబుళ్లు శంకర్, కైలాస్, దినేష్‌లు పాల్గొన్నారు.



కంటైనర్‌లోని పశువులు

గోవులు తరలిస్తున్న వాహనం పట్టివేత

నిర్మల్‌టౌన్: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనాన్ని జిల్లా కేంద్రంలో పలువురు యువకులు పట్టుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కెరమెరి నుంచి భైంసా వైపు గోవులను తరలిస్తున్నట్లు స్థానిక యువకులకు సమాచారం అందింది. వెంటనే గోవులు తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని పోలీసులకు విషయం తెలియజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గోవులను పట్టణంలోని బంగల్‌పేట్ గోశాలకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత ఆత్మహత్య



అనసూయ (ఫైల్)

ఇంద్రవెల్లి: వరకట్న వేధింపులు భరించలేక వివాహి త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని బజార్‌గల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దనోర.బి గ్రామానికి చెందిన అనసూయ(24)కు ఆరేళ్ల క్రితం ఇంద్రవెల్లికి చెందిన జతురే శివాజీతో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఐదు తులాల బంగారంతో పాటు ఇంటి సామగ్రి కట్నంగా ఇచ్చారు. కాగా అదనపు కట్నం రూ. 20వేలు కావాలని కొంతకాలంగా భర్తతో పాటు అత్త, మామలు మానసికంగా ఆమెను వేధిస్తున్నారు. వారి వేధింపులు తాళలేక ఈ నెల 23న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనసూయ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆస్పత్రిని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచనామా నిర్వహించి పోస్టుమార్టమ్‌కు తరలించారు. అనసూయ తండ్రి సంపతే గోపినాథ్ ఫిర్యాదు మేరకు భర్త జతురే శివాజీతో పాటు అత్తమామలు జతురే అంగద్, దైవబాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వాగులపై ప్రజలకు అవగాహన



వాగు వద్ద అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఉట్నూర్‌రూరల్: వాగులో గల్లంతై పలువురు మృతి చెందుతుండడంతో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉట్నూర్ ఎస్సై మనోహర్ ఆధ్వర్యంలో పోలీసు బృందంతో కలిసి భీముగూడ, అడగూడ, నర్సాపూర్ –జే గ్రామాలను సందర్శించారు. వర్షం కురిసే సమయంలో కల్వర్టులు, వాగులు, వంతెనలు దాటవద్దని, విద్యుత్ స్తంభాల నుంచి దూరంగా ఉండాలన్నారు. వర్షం పడుతున్నప్పుడు సెల్‌ఫోన్‌లు ఉపయోగించడం ప్రమాదకరమని, దెబ్బతిన్న ఇళ్లలో ఉండకూడదన్నారు. వాగు దాటే సమయంలో తాడును ఉపయోగించాలని సూచించారు.

'అవ్వతాతలకు ఉత్తరం' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జైనథ్: మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 7న పత్తిపాత ఫౌండేషన్, గరిపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో 'అవ్వతాతలకు ఉత్తరం, కథా రచన' పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్ ఇతరులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కాగా ఆగస్టు 7న పాఠశాలలో లక్ష్మీపూర్‌కు చెందిన 40 మంది విద్యార్థులు, జెడ్పీఎస్ఎస్ కూరకు చెందిన మరో 10 మంది విద్యార్థులు కథా రచన, ఉత్తరాలు రాసే పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఐటీడీఏ పీవోకు అధికారాలు కొనసాగించాలి

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడిజిల్లా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంతో పాటు భూ సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వాలు కల్పించిన సింగిల్‌లైన్ అడ్మినిస్ట్రేషన్ హక్కులను ఐటీడీఏ పీవోకు కొనసాగించాలని ఆదివాసీ హక్కుల పోరాటసమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావు డిమాండ్ చేశారు. శనివారం ఉట్నూర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఉమ్మడి జిల్లా తుడుందెబ్బ అనుబంధ సంఘాల నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ఐటీడీఏ ఏజెన్సీల్లోని సివిల్ కేసులను ప్రాజెక్టు అధికారి వద్ద దావాలు ఫైల్ చేయడానికి అనుమతి కల్పించి, కేసుల పరిష్కారానికి పీవోకు శాశ్వత అధి కారాలు కల్పించేలా ప్రభుత్వ పరంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసీల భూ సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతినిధిగా ఐటీడీఏ పీవోను నియమించి ఏజెన్సీ ప్రాంత భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు తిరుపతి, సీతారాం, హన్మంత్‌రావు, పెందూర్ ధర్ము, అచ్యుత్‌రావు, బాలేరావు, మనోజ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పుర్క బాపురావు

అనారోగ్యంతో బాలుడు మృతి



గణేశ్ (ఫైల్)

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన వేల్పుల గణేశ్ (13) అనే బాలుడు పచ్చకామెర్ల వ్యాధితో శనివారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కప్పర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గణేశ్ గత 15 రోజుల నుంచి పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో వారం రోజుల పాటు చికిత్స తీసుకున్నాడు. వ్యాధి తీవ్రత పెరగడంతో వైద్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం పరిస్థితి విషమించి బాలుడు మృతి చెందాడు.

గుండెపోటుతో రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ మృతి

కుభీర్: మండల కేంద్రానికి చెందిన సిరిముల సాంబన్న హైదరాబాద్‌లో శనివారం ఉదయం గుండెపోటుతో చనిపోయారు. ఆయన మొదట నవోదయ పాఠశాలలో లెక్చరర్‌గా, ఆ తర్వాత ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం బెంగళూర్‌లో కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్‌గా పని చేసి 2022 ఆగస్టులో రిటైర్డయ్యారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆయన వచ్చే నెల 18న కూతురు పెండ్లి నిశ్చయం చేసుకున్నారు. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుభీర్‌లోని చిన్ననాటి స్నేహితులు, బంధువులు ఆయన మృతిపై సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెంబి: మండలంలోని మందపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో శనివారం గేదె మృతి చెందింది. గ్రామంలోని పెద్దమ్మ టెంపుల్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఎర్త్‌వైర్ తగిలి గేదె మృతి చెందినట్లు రైతు కొత్త నర్సయ్య వాపోయారు. విద్యుత్ శాఖ సిబ్బంది మృతి చెందిన గేదెను పరిశీలించి వివరాలు సేకరించారు. రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మృతి చెందిన గేదె వద్ద రైతు

నాడు వెలవెల.. నేడు జలకళ





బోథ్ మండలంలోని పొచ్చెర జలపాతం ప్రస్తుతం నీటితో కళకళలాడుతోంది. గత వేసవిలో నీరు లేక జలపాతం వెలవెలబోయి కళాహీనంగా మారింది. కాగా ప్రస్తుతం గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో భారీగా నీరు ప్రవహిస్తోంది. దీంతో పొచ్చెర జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. - బోథ్